నీటి సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నీటి సమస్యలను పరిష్కరించేందుకు జలమండలి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏమైనా నీటి సమస్యలు ఉంటే 155313, 18005997575 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆధునిక కోర్సులపై యువత ఆసక్తి



కార్యక్రమంలో డా.రామేశ్వరరావు, యూఈటీ అసోసియేట్ వీసీ చంద్ర , ఇరు సంస్థల అధికారులు

- ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు
- ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై యూఎస్‌లోని 'యూఈటీ'తో 'ఎస్కీ' ఒప్పందం

రాయదుర్గం: నేటి తరం యువత ఆధునిక కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీపై అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా మంగళవారం ఓ ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు సంస్థలకు చెందిన అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత ఆసక్తిని చూసి ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ కోర్సులలో భాగంగా 5జీ టెక్నాలజీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ టెక్నాలజీ తదితర ఆధునిక కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఇక్కడి యువతకు శిక్షణ ఇచ్చి వారి ఉజ్వల భవితకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీతో ఒప్పందంతో యువతకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ కార్యాలయ చీఫ్ లక్ష్మీకాంతరావు, పలు డివిజన్లకు చెందిన హెడ్స్, యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అసోసియేట్ వైస్‌చాన్సలర్ చంద్ర ఎస్ దపక, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ మావూడూరి, ఆర్‌డివి ప్రసాద్, ఇరు సంస్థల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఉత్సవాలు ప్రారంభం





ప్రత్యేక అలంకారంలో రంగనాథస్వామి

రాయదుర్గం: గోపన్‌పల్లి, పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం రంగనాథస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, అలంకారం తదితర పూజలను నిర్వహించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.

నేటి పూజలు..

గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయంలో రెండురోజుల ఉత్సవాలలో భాగంగా బుధవారం రెండో రోజు ఉదయం 6 గంటలకు ఆలయ సమీపంలోని సింగబావి వద్ద స్వామివారికి అవభృత స్నానం చేయిస్తారు. అనంతరం మేళతాళాలతో తిరిగి ఆలయానికి తీసుకొచ్చి పూజ చేస్తారు. భక్తుల దర్శనం అనంతరం ఉ.8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ పఠనం ఉంటుంది.

హైదరాబాద్ స్థానంలో కచ్చితంగా బీజేపీ గెలవాలి



కార్వాన్‌లో ఛాయ్ పే చర్చ కార్యక్రమంలో మాధవీలత, రాంనరేష్ తివారి

లంగర్‌హౌస్: ఈ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంలో కచ్చితంగా బీజేపీ గెలవాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని జాతీయ బీజేపీ కిసాన్ మోర్చా రాజస్థాన్ రాష్ట్ర ఇన్‌చార్జి రాంనరేష్ తివారీ అన్నారు. సోమవారం రాత్రి లంగర్‌హౌస్‌లోని శివమందిర్ పాఠశాలలో కార్వాన్ నియోజకవర్గంలో ఛాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంనరేష్ తివారీ మాట్లాడుతూ.. ఈసారి నారీ శక్తిని హైదరాబాద్‌లో పోటీకి అవకాశం అనేది సామాన్యమైన నిర్ణయం కాదన్నారు. సామాజిక మార్పు, ముఖ్యంగా మహిళల్లో చైతన్యం, అందరి అభివృద్ధి కోసం మాధవీలత చేస్తున్న కార్యక్రమాలు అమోఘం అన్నారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ.. అందరూ కలిసి కట్టుగా ముందుకు వెళితే విజయం సునాయసం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, నాగేంద్రప్రకాష్ రెడ్డి, సుగంధపుష్ప తదితరులు పాల్గొన్నారు.

17న శ్రీరామనవమి శోభాయాత్ర



కార్యాలయాన్ని ప్రారంభించిన గోవింద్‌రాఠి, వైకుంఠం తదితరులు

అబిడ్స్: భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి శోభాయాత్రను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని నిర్వాహకులు గోవింద్‌రాఠి, మెట్టు వైకుంఠం, శ్రీరామ్ వ్యాస్, మహేందర్ వ్యాస్ వెల్లడించారు. 17న శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కన్నుల పండువగా శోభాయాత్ర చేపడుతామన్నారు. కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, లాల్‌సింగ్, బీజేపీ అభ్యర్థి మాధవీలత, మోహన్‌గుప్తా, నారాయణ్ సర్దా, కరోడీమాల్ నర్సింగ్ పూర్యాలతో కలిసి సిద్ధిఅంబర్‌బజార్ బహేతిభవన్‌లో భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..లక్షలాది మంది రామ భక్తులతో 17న సీతారామ్‌బాగ్ సీతారామ ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

లష్కర్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం



పద్మారావు గౌడ్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ఈ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నుంచి బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నాంపల్లి నియోజకవర్గంలో కూడా అత్యధిక ఓట్లు పోలయ్యే విధంగా తనవంతూ కృషి చేస్తానన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ లబ్ధిదారులంతా పద్మారావు గౌడ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.



పంచాంగ శ్రవణం వింటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఉప్పర్‌పల్లి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పంతులు

ఆనందోత్సాహాలతో ఉగాది





ప్రవచనాలు చేస్తున్న గరికపాటి నరసింహా రావు , ప్రవచనాల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు మంగళవారం ఉగాది పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులుపెద్ద సంఖ్యలో తరలివెళ్లగా ప్రాంగణాలు సందడిగా మారాయి. ఉదయం నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం పంచాంగ పఠనాన్ని నిర్వహించారు. పంచాంగ పఠనం అనంతరం దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో పచ్చడి వితరణ చేపట్టారు. పంచాంగ పఠనంతో పాటు పూజ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో..

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల్లో పంచాంగ శ్రవణాలను చదివి వినిపించారు. పుప్పాలగూడ హనుమాన్ ఆలయంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, ఖానాపూర్‌లో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాటేదాన్ బంగారు మైసమ్మ దేవాలయంలో..

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ బంగారు మైసమ్మ ఆలయంలో నిర్వహించిన పంచాంగం శ్రవణంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్ పరిధిలో..

అత్తాపూర్ : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అత్తాపూర్ రాంబాగ్ నెలకొన్న పురాతన ఆలయంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు కొమ్మిడి ఉమా మహేశ్వరీరెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి నారేగూడెం మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతగౌరి శంకర్, కొమురయ్య, సుధాకర్, వెంకటేష్, విజయ్ కుమార్, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో గరికపాటి ప్రవచనలు

రాజేంద్రనగర్: ఉగాది పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి మహా సహస్ర అవధాని డాక్టర్ గరికపాటి నరసింహా రావు ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా కాల మహిమ అనే అంశాన్ని వివరించారు. ప్రవచనాలను వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు వేద పండితులు పంచాంగ పఠనాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

భవానీ కాలనీలో ..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవానీ కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దేవాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.



భవానీ కాలనీలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



ఖానాపూర్‌లో పాల్గొన్న మాజీ ఎంపీపీ, కౌన్సిలర్, గ్రామస్తులు



పుప్పాలగూడ పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరరాలయంలో భక్తులు..

రంజాన్ మార్కెట్ చివరి రోజే కీలకం

- అనూహ్యంగా పెరగనున్న వినియోగదారుల తాకిడి
- చార్మినార్ పరిసరాల్లో ఉచిత పార్కింగ్ సౌకర్యం
- అందుబాటులోకి 12 ఉచిత పార్కింగ్ స్థలాలు



పంచ్ మోహల్లాలో అందుబాటులో ఉన్న తాత్కాలిక ఉచిత పార్కింగ్

చార్మినార్: జుమ్మాతుల్ విదా ముగియడంతో ఈనెల 11న ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగను నిర్వహించడానికి ముస్లింలు సిద్ధంగా ఉన్నారు. దీంతో రంజాన్ మార్కెట్ చివరి రోజు వినియోగదారులతో సందడిగా మారనుంది. ఊహించని విధంగా చార్మినార్ పరిసరాలన్నీ జనం రద్దీతో కిటకిటలాడనున్నాయి. గత నెల నుంచి రంజాన్ మార్కెట్ కొనసాగుతున్నప్పటికీ.. చివరి రోజు మరింత ఊపందుకుంటుంది. కేవలం నగర ప్రజలే కాకుండా చుట్టుపక్కల జిల్లాల ప్రజలు సైతం రంజాన్ మార్కెట్‌ను సందర్శించనుండడంతో విపరీతంగా రద్దీ పెరగనుంది. రంజాన్ మార్కెట్‌ను సందర్శించడానికి వచ్చే వారికి ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సంబంధిత అధికారులు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా వాహనాలలో వచ్చే వాహనదారుల సౌకర్యార్థం దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు చార్మినార్ పరిసరాలలో 12 ఉచిత పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెచ్చారు.

ఉచిత పార్కింగ్ సౌకర్యం..

- ఎలాంటి రుసుం లేకుండా ఆరు ఉచిత పార్కింగ్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో వాహనదారులు సంబంధిత అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నారు.
- దీంతో పాటు మోతీగల్లీలోని పాత పింఛన్ పేమెంట్ కార్యాలయ ఖాళీ స్థలాన్ని కూడా తాత్కాలిక పార్కింగ్ కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు.
- పంచ్ మోహల్లా పార్కింగ్‌తో పాటు మోతీగల్లీలోని స్థలం కూడా పార్కింగ్ కోసం అందుబాటులోకి తెచ్చారు.
- అలాగే మోతీగల్లీలోని ఉర్దూ మస్కాన్, ఎస్‌వైజే కాంప్లెక్స్, జీహెచ్‌ఎంసీ సర్దార్ మహల్ భవనం రోడ్డు, సిటీ కాలేజీ, కుడా స్టేడియం, ముఫిదుల్లానాం గ్రౌండ్, ఖిల్వత్ గ్రౌండ్, ఎంజే బ్రిడ్జి, చార్మినార్ యునానీ ఆసుపత్రి ప్రాంగణం.. ఇలా 12 ప్రాంతాల్లో ఉచితంగా పార్కింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు..



రంజాన్ మార్కెట్‌తో పాటు పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి అధిక సంఖ్యలో వాహనదారులు వస్తుంటారు. వీరందరి సౌకర్యార్థం 12 పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎలాంటి రుసం లేకుండా ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చు. ఒక క్రమ పద్ధతిలో వాహనాలను పార్కు చేసుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేశాం. ఎవరైనా అక్రమంగా పార్కింగ్ స్థలాల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్, దక్షిణ మండల ట్రాఫిక్ ఏసీపీ

మొక్కల నిర్వహణ గాలికి..!

- బండ్లగూడ కార్పొరేషన్‌లో కానరానీ పచ్చదనం
- గత ప్రభుత్వ హయాంలో డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు
- నీరు పట్టక వాడిపోతున్న వైనం



డివైడర్ మధ్యలో వాడిపోయిన మొక్కలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో రోడ్డు మధ్యలోని డివైడర్‌లో మొక్కలు నాటారు. అయితే వాటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో వాడిపోయి కనిపిస్తున్నాయి. అసలే ఎండకాలం.. అపై ఎండలు దంచికొడుతున్నాయి. వాటికి సక్రమంగా నీళ్లు పట్టకపోవడంతో ఎండిపోయి కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం కోట్లాది నిధులతో హరితహారం పథకంలో భాగంగా రోడ్లకిరువైపులా, డివైడర్ల మధ్యలో పెద్ద ఎత్తున మొక్కలు నాటింది. అయితే వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఎక్కడ చూసిన ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి.

కార్పొరేషన్‌లో పచ్చదనం కరువు..

ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. మున్సిపల్ పరిధిలో మొక్కల సంరక్షణపై సరైన నిర్వహణ అధికారుల పర్యవేక్షణ లేక చాలా చోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కలు బతికుండాలంటే నిత్యం నీరు పట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మొక్కలు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

శంషాబాద్ రూరల్: ఆవులను అక్రమంగా కబేళాకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మదన్‌పల్లి శివారు బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. షాద్‌నగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ఆపి పరిశీలించగా అందులో 15 ఆవులు, 58 ఎద్దులు ఉన్నాయి. అమీరుద్దీన్ అనే వ్యక్తి నుంచి వీటిని విజయవాడలో కొనుగోలు చేసి కర్నూలు మీదుగా హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. ఆవులను బహదూర్‌పూర్‌లోని కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించి లారీ డ్రైవర్ దర్శనం కృష్ణయ్య, హెల్పర్ ఎండీ అమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీ యజమాని జైనుద్దీన్‌తో పాటు మిగిలిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే పశువులను స్థానిక గోశాలకు తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మైలార్‌దేవ్‌పల్లి: ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పింక్ బిల్డింగ్‌లో శర్మ తన భార్యతో కలిసి ఉంటున్నాడు. ఇద్దరు ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేవారు. అది గమనించిన దొంగలు సోమవారం భార్యభర్తలు ఉద్యోగానికి వెళ్లగానే ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లారు. బీరువాలో ఉన్న రూ. 90వేలు, 11 తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు దొంగిలించారు. సాయంత్రం దంపతులు ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలోని నగదు, బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. చుట్టుపక్కలా వారిని విచారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం



సుశీల

శంషాబాద్ రూరల్: భర్తతో గొడవపడిన మహిళ తన కూతురుతో పాటు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి చెందిన సుశీల, ప్రభు దంపతులకు తొమిదేళ్ల కూతురు ఉంది. కొన్ని రోజులుగా ప్రభు భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సుశీల తన తండ్రి పర్దం రాములుకు ఫోన్ చేసి తనను భర్త వేధిస్తున్నాడని కూతురును తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు చెప్పింది. తర్వాత వారిద్దరూ కనిపించ లేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాలు అప్పగింత

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన బండ్లగూడ సన్‌సిటీకి చెందిన ఆనంద్ కుటుంబ సభ్యుల మృతదేహాలకు మంగళవారం ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను రాజేంద్రనగర్ పోలీసులు ఆనంద్ సోదరుడికి అప్పగించారు. ఆనంద్ సోదరుడు రామాంతాపూర్‌లో నివసిస్తున్నాడని.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించేందుకు రామాంతాపూర్‌కు తీసుకెళ్లినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

హైదర్‌షాకోట్‌లో అగ్ని ప్రమాదం

మణికొండ: ఇంట్లోని పూజ గదిలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన హైదర్‌షాకోట్ గ్రామంలో మంగళవారం జరిగింది. శంకర్ అనే వ్యక్తి ఇంట్లో పూజ చేసి భార్యతో కలిసి గుడికి వెళ్లాడు. పూజ గదిలో పెట్టిన దీపం కింద పడి పూజా సామగ్రికి అంటుకుని మంటలు లేచి పక్కనే ఉన్న టీవీ యూనిట్‌కు కూడా వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కిస్మత్‌పూర్‌లో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో శ్రీకృష్ణ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో కాలిపోయింది. దీంతో విద్యుత్ కేబుల్ వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సిబ్బందికి ఫోన్ చేసిన ఎవరూ స్పందించలేదని స్థానికులు వాపోయారు. పండుగ రోజు కరెంట్ లేక ఇండ్లలో నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేసిన స్పందించలేదని మండిపడ్డారు.

పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: సమాజంలో పురస్కారాలు బాధ్యతను పెంచడంతో పాటు స్ఫూర్తిని నింపుతాయని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతీలో మెగా సిటీ నవకళావేదిక, మదర్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి పురస్కారాలు ఇవ్వడం వల్ల వారికి మరింత ప్రోత్సాహం కలుగుతుందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, కేంద్ర సెన్సార్ బోర్డు సలహామండలి సభ్యులు ఎస్.బి.రామ్, సంస్థ అధ్యక్షులు మల్లికార్జున్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవాలి

గోల్కొండ: నాయకులు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్ ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో జరుగుతున్న పనులను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. పనులు వేగంగా, నాణ్యత లోపించకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.